క్లుప్తంగా

ప్రైవేటీకరణపై మౌనం వీడాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

ప్రకాశం నగర్: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మౌనం వీడాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కృష్ణా–గోదావరి బేసిన్‌లో లభ్యమవుతున్న గ్యాస్, చమురు సహజ వనరులపై అప్పుల్లో ఉన్న ఆంధ్రాకు వాటా దక్కాలని కోరుతూ జూలైలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. నెల రోజులుగా విశాఖపట్నంలో కార్మికులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలను సమైక్యపర్చి.. నిరంతర పోరాటం సాగిస్తామన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సహాయ కార్యదర్శి కె.రాంబాబు, వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అపాయకరంగా గొయ్యి



కాతేరు రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామం నుంచి కామన్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డులో ఎన్టీఆర్ బస్‌షెల్టర్ సమీపంలో గొయ్యి అపాయకరంగా మారింది. ఈ రోడ్‌లో నిత్యం వందలాది వాహనాలు, ఆర్టీసీ, స్కూల్ బస్సులు ప్రయాణిస్తుంటాయి. ఈ గొయ్యి వలన తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి సమయాల్లో గొయ్యి కనపడక వాహనచోదకులు అదుపుతప్పి.. కిందపడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీజేపీలో పలువురు ముస్లింల చేరిక

సీటీఆర్ఐ: బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు సమక్షంలో పలువురు ముస్లింలు ఆ పార్టీలో చేరారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ రాజమండ్రి ఒకటో మండలం అధ్యక్షురాలు తుమ్మగుంట రమణమ్మ ఆధ్వర్యంలో నగరానికి చెందిన మహ్మద్ రియాజ్‌తో పాటు కొందరు ముస్లింలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ, మతాలు వేరైనా.. అందరూ భారతీయులే అన్నది బీజేపీ విధానమని, అందరూ కలసికట్టుగా జీవించాలన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీల సంక్షేమానికి అనేక నిర్ణయాలు చేశారన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఆడబాల రామకృష్ణ, రొంగల గోపీ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మృతదేహానికి అంత్యక్రియలు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన గద్దె ప్రభావతి (76) మృతదేహానికి ఆదివారం ఎట్టకేలకు దహన సంస్కారాలు నిర్వహించారు. ప్రభావతి పెద్ద కుమారుడు మూడు ఎకరాలు తీసుకున్నాడని, రెండో కుమారుడి కుటుంబ సభ్యులకు 1.50 ఎకరం ఇవ్వాలని గ్రామస్తులు శనివారం మృతదేహాన్ని శ్మశాన వాటికకు తీసుకువెళ్లకుండా అడ్డుకున్న సంగతి విదితమే. ప్రభావతి రెండో కుమారుడు కొన్నేళ్ల క్రితం మరణించగా.. అతడి భార్య అనంతలక్ష్మి ఉద్యోగం చేస్తున్న కుమారులతో విశాఖపట్నంలో ఉంటుంది. ప్రభావతి పెద్ద కుమారుడు నాగేశ్వరరావు వద్ద ఉంటుంది. తల్లి ఆలనాపాలనా తనే చూశానని, మూడు ఎకరాలు తనకే రాసిందని తెలపడంతో గ్రామస్తులు మృతదేహాన్ని అడ్డుకున్నారు. ఆదివారం గ్రామస్తులు పెద్ద కుమారుడితో చర్చలు జరిపారు. ఎకరం పొలం రెండో కుమారుడి కుటుంబానికి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చిన అనంతరం.. ప్రభావతి మృతదేహానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

సినిమాలు

శ్యామల	:	భైరవం
సూర్యమినీ	:	ఫైనల్ డెస్టినేషన్, మిషన్ ఇంపాజిబుల్
సూర్యప్యాలెస్	:	కరాటే కిడ్
స్వామి	:	ఖలేజా
శివజ్యోతి	:	హిట్-3
అనుశ్రీ	:	ఖలేజా
రాజా	:	ఖలేజా
ఊర్వశి	:	ఘటికాచలం
మేనక	:	శుభం
రంభ	:	షష్టి పూర్తి
అప్సర	:	సింగిల్
కుమారి	:	వర్షం
అశోక	:	భైరవం
నామవరం		
వీఎస్ మహల్	:	భైరవం
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	భైరవం
కడియం		
వెంకటసూర్య	:	భైరవం



నిర్వహణకు నోచుకోని పుష్కరఘాట్‌లో ఐ లవ్ రాజమహేంద్రవరం సెల్ఫీ పాయింట్



అధికారుల నిర్లక్ష్యంతో చనిపోయిన మొక్కలు

ఘాట్‌గా దుర్గంధం

- పట్టించుకోని నగరపాలక సంస్థ యంత్రాంగం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సందర్శకులు
- వ్యర్థాలతో నిండిపోయిన ఫౌంటైన్
- ఇదీ గోదావరి పుష్కరాల రేవు దుస్థితి



నాచు పేరుకున్న ఫౌంటైన్



ఫౌంటైన్ వద్ద మద్యం సీసా, ప్లాస్టిక్ వ్యర్థాలు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక సందర్శకులే కాకుండా, సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే పర్యాటకులకు రాజమహేంద్రవరం నగరంలో పుష్కర్ ఘాట్ ఏరియా ప్రత్యేక సందర్శన స్థలంగా ఉంది. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ రాజమహేంద్రవరం' సెల్ఫీ పాయింట్ వద్ద సైతం సరైన నిర్వహణ లేకపోవడం సందర్శకులను విస్మయానికీ.. ఇబ్బందులకూ గురిచేస్తోంది. లక్షలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన సుందరీకరణ మొక్కలు, వాటర్ ఫౌంటైన్ సక్రమంగా పని చేయకపోవడంపై సందర్శకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు జిల్లాకే తలమానికంగా ఉన్న పుష్కర ఘాట్ ప్రాంతాన్ని నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన ఆవశ్యకత ఉందని సందర్శకులు చెబుతున్నారు. దుర్గంధం కారణంగా దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చే పర్యాటకులు, సందర్శకులు ఈ ప్రాంతంలో నిలబడేందుకు ఆసక్తి చూపడం లేదు. నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు రాజమహేంద్రవరం ఐకాన్‌గా ఉన్న ఐ లవ్ రాజమహేంద్రవరం సెల్ఫీ పాయింట్ వద్ద నిత్యం శుభ్రపరిచేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనిపై కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

చనిపోతున్న మొక్కలు

సుందరీకరణ పేరుతో ఏర్పాటు చేసిన మొక్కలు అనేక ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చనిపోతున్నాయి. మొక్కల రక్షణకు స్ప్రింకర్లు ఏర్పాటు చేసినప్పటికీ మొక్కలు చనిపోతుండడం గమనార్హం. దీనిపై అధికారులు కనీస దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన సుందరీకరణ మొక్కలు చనిపోవడంపై నగర ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది



పుష్కర్ ఘాట్‌లోని ఐ లవ్ రాజమహేంద్రవరం సెల్ఫీ పాయింట్ వద్ద తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొంది. చీకటిపడితే చాలు మందుబాబులు సెల్ఫీ పాయింట్ వద్ద మద్యం సేవిస్తూ, అక్కడే మూత్ర విసర్జన చేస్తూ, అధ్వానంగా చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి ఈ ప్రాంతం నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలి.
– గుదే రఘునరేష్, వ్యవస్థాపక కార్యదర్శి, వలంటీర్ సోషల్ సర్వీస్ అసోసియేషన్

సందర్శకులకు ఇబ్బందికరం



చారిత్రక ప్రసిద్ధి చెందిన రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ ఏరియాలో ఏర్పాటు చేసిన ఐ లవ్ రాజమహేంద్రవరం సెల్ఫీ పాయింట్ వద్ద ఫౌంటైన్ ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోయింది. మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి ఉన్నా నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బంది అటువైపు దృష్టి సారించకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.
– గట్టి ప్రభు, రాజమహేంద్రవరం

స్పోకెన్ ఇంగ్లిష్‌పై పోటీలు



స్పోకెన్ ఇంగ్లిష్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీఎం స్కూల్ ఇంగ్లిష్ టీచర్ నిర్మల స్పోకెన్ ఇంగ్లిష్‌పై పోటీలు నిర్వహించారు. అనంతరం పుస్తక పఠనం, హ్యాండ్ క్రాఫ్ట్, లలిత సంగీతం, భగవద్గీత తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మతల రమేష్, ఆదిరెడ్డి శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, కిర్ల తాతారావు, పాడిపిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సీటీఆర్ఐ: చెట్ల కొమ్మలు తొలిగించేందుకు మల్లయ్యపేట పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీవ్‌గాంధీ నగర్, వడ్డీలపేట, మున్సిపల్ కాలనీ, ఆర్‌అండ్‌బీ వాంబే కాలనీ, లూథర్‌గిరి ఏరియాలకు ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అదేవిధంగా కొంతమూరు పరిధిలోని సాయిరాం కాలనీ, బొమ్మన కాలనీ, వేంకటేశ్వర ప్లాస్టిక్స్, పరిమినగర్, కొలమూరు గ్రామం, రాయుడు పాకల ప్రాంతాల్లో ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వివరించారు.

యువతరానికి ఆదర్శప్రాయుడు జనార్దన్



జనార్దన్‌ను సత్కరిస్తున్న ఆయా సంస్థల ప్రతినిధులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అంకిత భావం, చిత్తశుద్ధితో విశిష్ట సేవలందించిన జనార్దన్ నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఆల్కాట్‌తోట సత్యసాయి మందిరంలో ఆదివారం రాత్రి జరిగిన సత్యసాయి గురుకులం వార్డెన్ వెలిశెట్టి జనార్దన్ ఉద్యోగ విరమణ సత్కార సభలో ఆయన మాట్లాడారు. 38 ఏళ్ల గురుకులంలో విద్యార్థులకు, గోదావరి పుష్కరాలు, ఇతర సేవల్లో రుచికరమైన ఆహారాన్ని అందించడంలో ఆయన సేవలు మరువలేమన్నారు. గురుకులం కరస్పాండెంట్ అయోధ్యల శ్యామసుందర్ మాట్లాడుతూ, సొంత ఇంటి కంటే ఎక్కువగా గురుకుల విద్యార్థుల్ని ఆదరాభిమానంతో చూడడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జనార్దన్‌కు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి, నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ గురయ్య, మందిరం అధ్యక్షుడు దండమూడి గిరిధర్, కార్యదర్శి గంటా హనుమంతరావు, టి.సోమసుందర్ రెడ్డి, సేవా సమితి కన్వీనర్ పాలచర్ల రఘురాం, జోనల్ విద్యా విభాగ సమన్వయకర్త ఎం.దివాకర్, జిల్లా పదాధికారులు, జోనల్ కన్వీనర్ పాల్గొన్నారు.

ఒక్క పథకమైనా అమలు చేశారా..?

- చంద్రబాబు మోసాలకు నిరసనగా 4న వెన్నుపోటు దినం
- నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేణుగోపాలకృష్ణ, గిరజాల బాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలను వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన నిర్వహించే ప్రజా ఉద్యమమైన వెన్నుపోటు దినం పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం ఆయన బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, కల్లబొల్లి మాటలతో ప్రజలను చంద్రబాబు మభ్య పెడుతున్నారన్నారు. హామీలు అమలు చేయకుండా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజలను పీడిస్తున్నారన్నారు. హామీల అమలుపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకురావడమే లక్ష్యంగా వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ నెల 4న నిర్వహించే ర్యాలీలో నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు(బాబు) మాట్లాడుతూ, రాజకీయాల్లో వెన్నుపోటుకు ఆద్యుడిగా చంద్రబాబు పేరుగాంచారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలు నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉల్లాసంగా... ఉత్సాహంగా..



ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

సీటీఆర్ఐ: చిన్ననాటి మిత్రులంతా ఆడుతూ.. పాడుతూ ఉత్సాహంగా గడిపారు. చిన్నప్పుడు చేసిన అల్లరి గుర్తు తెచ్చుకుంటూ ముప్పై ఏళ్ల వెనక్కి వెళ్లిపోయారు. 1995లో ఐటీఐలో చదువుకున్న మిత్రులు ఆదివారం ఒకచోట కలిసి, కళాశాల ప్రస్తుత ప్రిన్సిపాల్‌ని సత్కరించారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని ఓ ఐటీఐలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో వివిధ వృత్తులలో స్థిరపడ్డారు. వారు ఓ వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకుని, ఆదివారం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా వారంతా ఆదివారం తాము చదివిన కళాశాలకు వెళ్లి అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐకే రాజును సత్కరించారు.

శత జయంతి వేడుకల్లో సేవా మహాయజ్ఞం

సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బులుసు, ఇతర ప్రతినిధులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా సత్యసాయి సహస్ర గ్రామ సేవా మహాయజ్ఞాన్ని నిర్వహిస్తునట్టు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఆదివారం స్థానిక ఆల్కాట్‌తోటలోని సత్యసాయి మందిరంలో జరిగిన జిల్లా పదాధికారుల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమ బ్రోచర్లను విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ, వేడుకల్లో భాగంగా ఏడాది పాటు స్వామివారి దివ్య పాదుకులకు, చిత్రపటానికి పూజలు చేసి, గ్రామాల్లో ఊరేగించాలని చెప్పారు. తపోవన పారాయణ, వైద్య సేవలు, మహిళలతో కుంకుమార్చన, జూలైలో మహిళలు, చిన్నారులతో తండులార్చన, గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో పాదుకల దర్శన, మొక్కలు నాటడం, అక్టోబర్‌లో స్వచ్ఛత నుంచి దివ్యత్వం వరకు, కుటుంబ భజనలు, నవంబర్‌లో తపోవన పారాయణ, బాబా శతజయంతి వేడుకలు, డిసెంబర్‌లో గాయత్రి హోమం, తల్లిదండ్రులతో సమావేశం, వచ్చే ఏడాది జనవరిలో యువతకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సులు, ఫిబ్రవరిలో ప్రశాంతి సేవలు, మార్చిలో సామూహిక వ్రతాలు, ఏప్రిల్‌లో వైద్య సేవలు చేయాలని తదితర కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో జిల్లాలో నిర్వహించే సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ప్రతినిధులు ఎన్వీ సాయిరాం, రామలక్ష్మి, శ్రీనివాసరాజు, వి.సుభాష్, విజయసాయి, త్రిమూర్తులు, గురుకులం కరస్పాండెంట్ శ్యామసుందర్, ప్రిన్సిపాల్ గురయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యపు గింజలతో గురూజీ చిత్రం



చిత్రంతో బబ్లూ

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువుకు చెందిన బబ్లూ అనే యువకుడికి ఫైన్ ఆర్ట్స్ అంటే ఎంతో ఇష్టం. ఢిల్లీలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్టస్ కోర్సు చేస్తున్న ఇతడు తరచూ ఏదో ఒక బొమ్మను గీస్తూ తన ప్రతిభను చాటుకునే ప్రయత్నం చేస్తుంటాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బబ్లూ తండ్రి రమేష్ కుటుంబ సమేతంగా పాతికేళ్ల క్రితం దివాన్‌చెరువు వచ్చారు. అప్పటి నుంచి ఇక్కడే పానీపూరీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న అతను పానీపూరీ రమేష్‌గా స్థానికులకు సుపరిచితుడు. ఏప్రిల్‌లో రెండు లక్షల ధాన్యపు గింజలతో వేంకటేశ్వరుని బొమ్మను చిత్రీకరించి, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందాడు. ఈసారి తనకెంతో ఇష్టమైన, తమ ప్రాంతానికి చెందిన గురుదేవ్ అంబాజీ ధామ్ నిపాన్య చిత్రాన్ని లక్ష ధాన్యపు గింజలతో వారం రోజుల్లో చిత్రీకరించాడు. ఆ చిత్రపటాన్ని స్వయంగా ఆయనకు ఈ నెల ఐదున అందజేస్తానని బబ్లూ తెలిపాడు. అంబాజీ ధామ్ నిపాన్యను అంతా గురూజీగా ఆరాధిస్తారని చెప్పాడు. ఆ రాష్ట్రంలోని మందసార్ జిల్లాలో శ్రీమత్ దేవి భాగవత్ కథను గురూజీ ఆరు రోజులు చెప్పి, ఆఖరి రోజున నిర్వహించే దివ్య దర్బార్‌లో కళ్లకు గంతలు కట్టుకుని, ఎదుటివారి భవిష్యవాణి వివరిస్తారని తెలిపాడు.

ముందే పాడిన తొలకరి రాగం

- వర్షపు జల్లులతో మెట్ట రైతుల్లో ఆనందం
- ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతల సమాయత్తం
- నారుమడులతో శ్రీకారం



నరేంద్రపురం గ్రామంలో నారుమడి కోసం పొలాన్ని దున్నుతున్న రైతు

రాజానగరం: నైరుతి రుతుపవాలు కాస్త ముందుగానే పలకరించడంతో మెట్టలో ఖరీఫ్ వరి సాగుకు అన్నదాతలు సమయాత్తమయ్యారు. అడపాదడపా కురుస్తున్న తొలకరి జల్లులు తొలకరి పంట సాగుకు అనుకూలతను చూపుతున్నాయి. సాధారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది, ఆ ఇబ్బందులు ఎదురుకాకుండా సకాలంలో సాగను చేపట్టాలని వ్యవసాయధికారులు చేస్తున్న సూచనల నేపథ్యంలో వాతావరణం కూడా అనుకూలించడం రైతాంగాన్ని మరింత ఉత్తేజపరుస్తోంది. అధిక దిగుబడులిచ్చే వరి వంగడాలను ఎంచుకునే పనులను అధిగమించి, నార్లు వేయడంలో బిజీగా ఉన్నారు.

సాగు నీటి సదుపాయాలు సమృద్ధిగా లేకపోయినా కానీ, గొట్టపు బావుల సదుపాయంతో పాటు, రుతుపవనాల రాకతో మెట్ట ప్రాంతంలో రైతులు ఖరీఫ్ వరి సాగుకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో సాగులో ముందుండే నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద, రాజానగరం ప్రాంతాల్లో ప్రస్తుతం వరి నారుమడులు వేయడంలో రైతులు బిజీగా ఉన్నారు. ఆరోగ్యవంతమైన నారును పొందాలంటే మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించాల్సి ఉంటుంది. దీంతో సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల సహాయకుల ద్వారా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలను పాటిస్తూ నారు కట్టడంలో నిమగ్నమయ్యారు.

నారుమడి తయారీ ఇలా..

వేసవిలోనే కొంతమంది రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు పూర్తి చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఆయా ప్రాంతాల్లోని పొలాలను మరోసారి చదును చేసి, నారుమడులు కట్టేందుకు వీలుగా తయారుచేస్తున్నారు. నారు పోయాల్సిన మడిని 10 – 12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టేందుకు, ఎక్కువైతే తీయడానికి వీలుగా ఎత్తు, పల్లాలు లేకుండా చదును చేయాలి. నీరు నిల్వ ఉంటే వేసిన విత్తనం మురిగిపోతుంది. ఈ కారణంగానే చాలామంది రైతులు మడుల్లో అక్కడక్కడా నీరు పోయేందుకు వీలుగా కాలువలు తీస్తుంటారు. ఎకరం పొలంలో నాట్లు వేసేందుకు నారును దంప నారుమడికైతే ఐదు సెంట్లు, బెంగాలీ నారుమడికైతే మూడు సెంట్లు సరిపోతుంది. సెంటు భూమికి ఐదు కిలోల విత్తనాలు చల్లాలి. మడిలో విత్తనాలు చల్లిన తరువాత ఐదు సెంట్ల మడికి రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులను వాడటం శ్రేయస్కరం.

విత్తన శుద్ధి చేయాలి

నారు పోసేముందు మంచి దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకుని, వాటిలో మొలక శాతాన్ని పరిశీలించాలి. అనంతరం ఆ విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లు సోకకుండా చాలావరకు నివారించవచ్చు. ఇందుగాను కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండిజంతో కలిపి రోజంతా నానబెట్టాలి. లేకుంటే కిలో విత్తనాలకు మూడు గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లాలి.

నూతన వరి వంగడాలు

బీపీటీ 5204 సన్న వరి వంగడానికి ప్రత్యామ్నాయంగా మార్టేరు శాస్త్రవేత్తలు ఎంటీయూ 1224, ఎంటీయూ 1262 వరి వంగడాలను తయారుచేశారు. ఎంటీయూ 1224 రకం 140 రోజులు, ఎంటీయూ 1262 రకం 150 రోజుల్లో కోతకు వస్తాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు మార్టేరు నుంచి పొందవచ్చు. పూర్తి వివరాలకు 99896 23805 నంబరుకు కాల్ చేసి తెలుసుకోవచ్చు.
– డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు, శాస్త్రవేత్త, జిల్లా ఏరువాక కేంద్రం, దివాన్‌చెరువు